క్లుప్తంగా

29 నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

రొళ్ల: ఖరీఫ్ సాగు కోసం ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా అందించనున్న రాయితీ విత్తన వేరుశనగ కాయలను ఈ నెల 29వ తేదీ నుంచి రైతులకు పంపిణీ చేయనున్నట్లు ఆదివారం సాయంత్రం బీజీ హళ్లి ఆర్‌బీకే వీఏఏ ప్రసన్నకుమార్ తెలిపారు. రొళ్ల మండల వ్యాప్తంగా అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రాయితీ విత్తన కాయల కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభించడం జగిందన్నారు. కే–6 రకం అయితే 30 కిలోల బస్తాకు సబ్సిడీ పోను రూ.1710, కదిరి లేపాక్షి కే–1812 రకం అయితే 30 కిలోల బస్తాకు సబ్సిడీ పోను రూ.1566 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక్కొక్క రైతు భరోసా కేంద్రానికి 167 బస్తాల చొప్పున రాయితీ విత్తన వేరుశనగ కాయలు సరఫరా అయ్యాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఆధార్ కార్డుతో పాటు పట్టాదారు పాసు పుస్తకం తీసుకొచ్చి త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

12 ద్విచక్ర వాహనాల సీజ్



వెంకటరమణపల్లిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

గోరంట్ల: మండల పరిధిలోని వెంకటరమణపల్లిలో ఆదివారం సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని పరిశీలించారు. రికార్డులు సరిగాలేని 12 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు.

లేపాక్షిలో...

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రంలో ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జూన్ 4న కౌంటింగ్ ఉంటుందని, గ్రామంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్తగా కార్డెన్ సెర్చ్ నిర్వహించామని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా గిరి ప్రదర్శన



గిరి ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని గుడ్డం రంగనాథ స్వామి ఆలయ గిరి ప్రదర్శన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవమూర్తులను పూలరథంలో కొలువుదీర్చి గిరి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగేంద్ర, అర్చకులు గోవిందశర్మ, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయండి



అలంకరణలో ఆంజనేయస్వామి

మడకశిరరూరల్: మండల పరిధిలోని చందకచెర్లు గ్రామంలో ఈనెల 31 నుంచి నిర్వహించనున్న ఆంజనేయస్వామి ఉత్సవాలను విజయవంతం చేయాలని దేవాదాయశాఖ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 31న వేకువజామున స్వామివారికి గంగపూజ, హోమం, పంచామృతాభిషేకం, అంకురార్పణ, సీతారాముల కళ్యాణం నిర్వహిస్తామన్నారు. జూన్ 1న హనుమాన్ జయంతి, జ్యోతుల ఉత్సవం, మధ్యాహ్నం స్వామి వారి బ్రహ్మరథోత్సవం, 2న పంచామృతాభిషేకం తదితర పూజ కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



విద్యుత్ స్తంభాల స్థానంలో కర్రలను నాటిన దృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు గ్రామంలో విద్యుత్ కేంద్రం వెనుక ఉన్న కాలనీలోని ప్రజలు బిక్కు బిక్కు మంటూ కాలం గడపాల్సిన పరిస్థితి. విద్యుత్ స్తంభాల స్థానంలో కర్రలు ఉంచి వాటిపై నుంచి విద్యుత్ తీగలు లాగి కరెంటు ఇస్తుండటమే ఇందుకు కారణం. ఇంటి అద్దెలు తక్కువని ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఎక్కువగా ఈ ప్రాంతానికి తరలిరావడంతో ఈ ప్రాంతం ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ప్రస్తుతం వర్షాలతో పాటు గాలుల ఉధృతి కూడా పెరగడంతో ఏ కట్టె ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వెంటనే కట్టెల స్థానంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులను కోరుతున్నారు.

నోరూరిస్తున్న మామిడి

- మార్కెట్లోకి వివిధ రకాల మామిడి పండ్లు
- బేనిషా, మల్లిక రకాలకు డిమాండ్
- కేజీ రూ.80 నుంచి రూ.120 దాకా పలుకుతున్న ధైనం



విక్రయానికి ఉంచిన మామిడి పండ్లు

హిందూపురం టౌన్: పండ్లలో రారాజు మామిడి. బంగారు రంగులో, నోరూరించే రుచితో, కమ్మటి వాసన, తినే కొద్దీ తినాలనిపించే కమ్మని అనుభూతినిస్తుంది. మండే ఎండల్లో దొరికే ఈ మధుర ఫలం. పండ్లలోనే మహత్తరమైన పండు ఇది. ఈ పండంత తియ్యటి పండు మరొకటి లేదంటే అతిశయోక్తికాదు. ఎన్నో దివ్య ఔషధ గుణాలు ఇమిడి ఉన్న మామిడి పండ్లు ఏటా వేసవిలోనే లభిస్తుంటాయి.

అందుబాటులో రకరకాల మామిడి పండ్లు

వేసవి కాలం అంటే మామిడి పండ్ల సీజన్. చూడగానే నోరూరించే మామిడి పండ్లను ఇష్టపడని వారంటూ ఉండరు. పిల్లల నుంచి పెద్ద వాళ్ల వరకూ అందరూ వీటి రుచికి ఫిదా అవుతారు. వేసవి కాలంలో మాత్రమే మామిడి పండ్లు వస్తాయి. రకాల రకాల మామిడి పండ్లు ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ కాలంలో చాలా మందికి మామిడి పండ్ల విక్రయాలే జీవనాధారం. రోడ్ల పక్కన, షాపులలో, తోపుడు బండ్లపై విక్రయాలు జరుగుతూ ఉంటాయి. మార్కెట్‌లో ప్రస్తుతం మల్లిక, రసపురి, కాలా పహడ్, బేనిషా, ఇమాయత్ తదితర రకాల మామిడి పండ్లు అందుబాటులో ఉన్నాయి.

ఈ మామిడి పండ్లకు యమా క్రేజ్

వేసవి సీజన్‌లో మామిడి పండ్లకు యమ క్రేజ్ ఉంటుంది. పండ్లలోనే మామిడి రారాజుగా పేరు గాంచింది. మామిడి పండ్లు తినని వారు ఉండరు అంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా మల్లిక, బేనిషా రకం మామిడి పండ్లను ప్రజలు ఎక్కువగా తినడానికి ఇష్టపడతారు. వీటి రుచికి అందరూ ఫిదా అవ్వాల్సిందే. మల్లిక, బేనిషా, కాలా పహడ్ మామిడి పండ్లు ప్రస్తుతం రూ.80 నుంచి రూ.120 దాకా విక్రయిస్తున్నారు. రసపురి రకం మామిడి పండ్లు అయితే కేజీ రూ.80 ధర పలుకుతున్నాయి. అలాగే ఇమాయత్ మామిడి పండ్లు కేజీ రూ.180 ప్రకారం విక్రయిస్తున్నారు.

ఆరోగ్యానికి మేలు

వేసవిలో వచ్చే వ్యాధుల బారినపడకుండా ఉండాలంటే మామిడి పండు తినాల్సిందేనని వైద్యులు చెబుతున్నారు. మామిడి పండ్లలో బీటాకెరోటీన్, ల్యూటీన్, జియాజాంథీన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయని అంటున్నారు. రకరకాల విటమిన్లు, మినరల్స్, ఫైబర్‌తో పాటు, విటమిన్ సీ అధికం లభిస్తుందని చెబుతున్నారు. మామిడికాయల్లో ఆమ్ల గుణం ఎక్కువగా ఉంటుందని, ఇది ఆహారం త్వరగా జీర్ణమయ్యేందుకు దోహదపడుతుందని అంటున్నారు. మామిడిలో యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉండటంతో క్యాన్సర్, గుండె సంబంధిత సమస్యలను దరి చేయనీయమని చెబుతున్నారు. అయితే చక్కెర శాతం అధికంగా ఉండే మామిడి పండు రుచిలో తిరుగులేనప్పటికీ డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు మాత్రం కాస్తంత జాగ్రత్తగా ఉండాలంటున్నారు.



మల్లికా, రసపురి మామిడి పండ్లు



బాదం , కేసరీ రకం మామిడి పండ్లు



బేనిషా రకం మామిడి పండ్లు

మామిడి పండ్లకు భలే డిమాండ్



ప్రస్తుతం మామిడి పండ్లకు భలే డిమాండ్ ఉంది. కేజీ రూ.80 నుంచి రూ.120 దాకా ధర పలికే వివిధ రకాల మామిడి పండ్లను విక్రయిస్తుంటాను. ఎక్కువగా ప్రజలు బేనిషా, మల్లిక మామిడి పండ్లను కొనడానికి ఇష్టపడుతున్నారు. ఎంతో తాజాగా, రుచిగా ఉండే మామిడి పండ్లను దిగుమతి చేసుకుని, విక్రయాలు జరుపుతున్నాము.

– శివప్ప, చిరు వ్యాపారి

పిల్లలు ఇష్టంగా తింటారు



మామిడి కాయలు తినడానికి పిల్లలు ఎంతో ఇష్టపడతారు. వేసవి కాలం వచ్చిందంటే చాలు మామిడి కాయల కోసం ఎదురు చూస్తుంటారు. వారంలో రెండు రోజులకు, మూడు రోజులకోసారి మామిడి కాయలను కొనుగోలు చేస్తుంటాము. మార్కెట్‌లో వివిధ రకాల మామిడి కాయాలు ఉన్నాయి. రుచికరమైన మామిడి కాయలను చూసి కొనుగోలు చేస్తుంటాం.

– ఆంజనేయులు, వినియోగదారుడు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

సోమందేపల్లి: వచ్చే నెల 4న ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై గట్టి నిఘా ఉంచినట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. అలాగే పాత కేసుల్లో ముద్దాయిలపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్నాయని, గ్రామాల్లోని ప్రజలందరూ ప్రశాంతంగా జీవించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎవరినీ ఉపేక్షించేదిలేదన్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా 400 మందిని బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పరిగి: మండలంలోని 33/11 కేవీ పెద్దిరెడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈఈ నిజాముద్దీన్ తెలిపారు. పెద్దిరెడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను ఉండదన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని శాసనకోట, ఎం చెర్లోపల్లి, మోదా, శ్రీరంగరాజుపల్లి, ముల్లమోతుకపల్లి, పాపిరెడ్డిపల్లి, పుట్టగూర్లపల్లి, కోనాపురం, పుట్టగూర్లపల్లి, గొరవనహళ్లి, పెద్దిరెడ్డిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఆయా గ్రామాల వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రొళ్ల: మండల పరిధిలోని కె.బ్యాడిగెర గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి గాయపడ్డారు. గ్రామస్తుల వివరాలమేరకు.. నాగరాజు పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో ఇంటి నుంచి బయలు దేరాడు. అయితే ద్విచక్ర వాహనానికి ఎదురుగా ఆవు అడ్డం వచ్చింది. ఆవును తప్పించబోయ కింద పడటంతో తల వెనుక భాగం తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు.

బ్యాంక్ సేవలపై నేడు అవగాహన

హిందూపురం అర్బన్: యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న సేవలపై సోమవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని వాసవీ ధర్మశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు స్థానిక యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ దయాకర్ తెలిపారు. ఖాతాదారులు హాజరుకావాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణ అందరి బాధ్యత



మాక్‌డ్రిల్‌లో భాగంగా అల్లరి మూకలను చెదరకొడుతున్న పోలీసులు

హిందూపురం అర్బన్: శాంతి భద్రతల పరిరక్షణ అందరి బాధ్యత. ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని డీఎస్పీ కంజాక్షన్ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలు, కౌంటింగ్ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకొన్న సమయంలో అల్లరి మూకలను ఎలా చెదరగొట్టాలన్న దానిపై పట్టణంలోని గాంధీ కూడలి వద్ద సబ్‌డివిజన్‌లోని సివిల్, ఏఆర్, మాబ్ ఆపరేషన్ టీం మాక్ డ్రిల్ నిర్వహించారు. బాష్పవాయువు ప్రయోగించడం, వాటర్ కెనాన్ ప్రయోగించడం, లాఠీచార్జ్, డమ్మీ బుల్లెట్ ప్రయోగించడం, ఫైరింగ్ వంటివి ఎలా చేపడుతారో ప్రదర్శించారు. కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా అల్లర్లకు ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. సీఐలు రియాజ్ అహమ్మద్, శ్రీనివాసులు, ఆర్ఐ చంద్రశేఖర్, ఎస్ఐలు గోపీ, గంగాధర్, హరూణ్ బాషా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్ట హర చతుర్థి

హిందూపురం: సంకష్ట హర చతుర్థి సందర్భంగా ఆదివారం వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రీనివాసనగర్, బెంగళూరురోడ్డులోని గణపతి ఆలయాల్లో స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పంచామృతాభిషేకం, గణపతి హోమాలు చేశారు. భక్తులు ఉదయం నుంచి ఉపవాసదీక్షలు నిర్వహించి రాత్రి ఆలయానికి చేరుకుని గణపతికి పూజలు చేసి కుంకుర్చానలు జరిపించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించి ఉపవాసదీక్షలను విరమించారు.

పేటవెంకటరమణ ఆలయంలో ...

స్థానిక పేట వేంకటరమణస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం వెంకటేశ్వరస్వామిని శ్రీకృష్ణుడి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళహారతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీదేవి, భూదేవి సమేత పేట వెంకటరమణస్వామి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుదీర్చి మంగళవాయిద్యాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు.



అలంకరణలో వినాయకుడు



శ్రీకృష్ణుడి అలంకరణలో వేంకటేశ్వరుడు

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి



దొడ్డీరప్ప (ఫైల్)

అమరాపురం: మండల పరిధిలోని గొడనకుంటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు దొడ్డీరప్ప (82) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న మండల పెన్షనర్ల సంఘం నాయకులు , ఆరోగ్య మైత్రి కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజు, శ్రీనివాసమూర్తి, థియోసాఫికల్ సొసైటీ సభ్యులు దొడ్డీరప్ప భౌతిక కాయంపై పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

అగళి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొనడంతో క్రిష్ణప్ప (56) తీవ్రంగా గాయపడ్డాడు. అగళికి చెందిన క్రిష్ణప్ప హోటల్‌లో పనిచేస్తూ భార్యా బిడ్లను పోషించుకున్నాడు. ఆదివారం పని నిమిత్తం బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా జాతీయ రహదారిపై గుర్తు తెలియని కారు అతని వాహనాన్ని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన క్రిష్ణప్పను బెంగళూరుకు తరలించారు.



ఆలూడిలో రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రంగనాథా పాహి..పాహి

అగళి: మండల పరిధిలోని ఆలూడిలో రంగనాథస్వామి ఊరేగింపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కర్ణాటకలోని గిడగనహళ్లి గ్రామంలో రంగనాథస్వామి విగ్రహాన్నిని పల్లకీలో ఉంచి మేళతాళాల నడుమ ఊరేగింపుగా గ్రామస్తులు ఆలూడి గ్రామానికి శనివారం తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి పల్లకీలో ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు

- ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప



అమరాపురం మండలం ఆలదపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప



గుడిబండ: కార్యకర్తలతో కలసి టీ బంక్‌లో టీ తాగుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

రొళ్ల: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి ప్రభంజనం సృష్టించడం ఖాయమని ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్ఎల్ ఈరలక్కప్ప పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని వన్నారనపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉగ్రప్ప ఇంట్లో జరిగిన శుభ కార్యక్రమానికి హాజరయ్యారు. తర్వాత రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగేగౌడు ఈరలక్కప్పకు పూలమాల వేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఈ నెల 13వ తేదిన జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళిపై పోలింగ్ కేంద్రాల వారీగా నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గంతో పాటు హిందూపురం పార్లమెంట్ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరుపున పోటీలో ఉన్న తన (ఈరలక్కప్ప)తో పాటు శాంతమ్మ కూడా అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయన్నారు. దీనికితోడు 2019లో వచ్చిన ఫలితాల కంటే రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక స్థానాలు వైఎస్సార్‌సీపీ కై వసం చేసుకోబోతోందని ధీమా వ్యక్తం చేశారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలే టీడీపీకి చివరి ఎన్నికలని విమర్శించారు. చంద్రబాబు బీజేపీ, జనసేనతో కలిసి వచ్చిన కూడా ప్రజలు మాత్రం పూర్తి విశ్వాసం వైఎస్సార్ సీపీపై నిలబడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగేగౌడు, పార్టీ మాజీ మండల కన్వీనర్ డాక్టర్ శివప్రసాద్, వైస్ ఎంపీపీ నాగరాజు, నాయకులు శివన్న, శ్రీనివాస్, లోకేష్, మల్లికార్జున, గంగరాజు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయం. అలాగే మడకశిర నియోజవకర్గంలో వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరు' అని మడకశిర వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వలస, వి.అగ్రహారం, ఆలదపల్లి గ్రామాల్లో నాయకులతో కలసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని సర్పంచులు నాగవేణి, గిరిజమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, నాయకులు నాగేంద్రప్ప, భీరలింగప్ప మోహన్ తదితరులతో మాట్లాడారు. 13వ తేదీ జరిగిన పోలింగ్ ఏ విధంగా జరిగింది? పోలింగ్ సరళిని నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరిందన్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ వైపే ఓటర్లు మొగ్గు చూపారని అంచనా వేశామన్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మాట్లాడుతూ ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కేవలం ప్రజల కోసమే పని చేశారన్నారు. కుల,మతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలను అందించిన ఘనత జగన్‌దేనన్నారు. ముఖ్యంగా మహిళలకు అనేక పథకాలు అందించారని వివరించారు. దీంతో మహిళా ఓటర్లు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొని వైఎస్సార్‌సీపీకే ఓటు వేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు వైఎస్సార్‌సీపీకి గతంలో కంటే ఎక్కువ సీట్లు వస్తాయన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని పీసీ గ్రామంలో నాయకులతో కలసి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మాట్లాడుతూ గత మూడు నెలల కాలం వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం అహర్నిషలు కృషి చేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కారేగౌడు, ఉప సర్పంచ్ ఆనంద్, భోజప్ప, నాగరాజు, నరసింహప్ప, బైరప్ప, శేఖర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులు స్వాధీనం



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పావగడ: తాలూకాలోని దొడ్డహళ్లి గ్రామంలో ఉన్న ఎస్ఎల్ఎన్ ట్రేడర్స్ ఎరువుల దుకాణంపై స్థానిక వ్యవసాయశాఖ అధికారులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగానే కాలం చెల్లిన క్రిమి సంహారక మందులను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా అమ్మకాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఎరువులు విక్రయించిన రైతులకు రశీదులతో పాటు జీఎస్టీ బిల్లులను సైతం అందించాలని వ్యవసాయశాఖ ఏడీ అజయ్ కుమార్ సూచించారు. అక్రమంగా విక్రయాలు సాగిస్తున్న నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎరువుల అమ్మకాల్లో అక్రమాలకు పాల్పడితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

లేపాక్షి: మండలంలోని బిసలమానేపల్లి పంచాయతీ పరిధిలోని వెంకటాపురంలో నూతనంగా నిర్మిస్తున్న సప్పలమ్మ ఆలయ నిర్మాణానికి బిసలమానేపల్లికి చెందిన బీఎస్.ప్రకాష్ కుటుంబ సభ్యులు రూ.71 వేల విరాళమిచ్చారు. ఆ మొత్తాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఎస్.ప్రభాకర్, వెంకటరెడ్డి, నారాయణస్వామి, మూర్తి, శివప్ప, గంగాధర్ పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

అమరాపురం: మండల పరిధిలోని నగోనపల్లికి చెందిన హనుమంతరాయప్ప ఆదివారం కొబ్బరి చెట్టు పై నుంచి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే.. ఆదివారం ఉదయం కొబ్బరి చెట్లలో టెంకాయలను కోయడానికి హనుమంతరాయప్ప వెళ్లాడు. కొబ్బరి చెట్టు ఎక్కి టెంకాయలు కోస్తుండగా అకస్మాత్తుగా కిందకు పడ్డాడు. గాయపడిన హనుమంతరాయప్పను 108 వాహనంలో మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు.